కార్పొరేటర్‌ పర్యటన



రాంనగర్‌ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్‌ శాంతి

అల్వాల్‌: అల్వాల్‌ డివిజన్‌ రాంనగర్‌ కాలనీలో కార్పొరేటర్‌ శాంతి శ్రీనివాస్‌రెడ్డి అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. కాలనీలో మౌలిక వసతులు కల్పించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. డ్రైనేజీ వ్యవస్థ, పారిశుద్ధ్య వ్యవస్థను బాగుచేయాలని, రోడ్లకు ప్యాచ్‌వర్క్స్‌ చేయాలని కోరారు. కాలనీలోని పార్కు స్థలం కబ్జా కాకుండా ఫెన్సింగ్‌ ఏర్పాటు చేయాలని సూచించారు. ఏఈ లక్ష్మి, ఎంటమాలజిస్ట్‌ అనిల్‌కుమార్‌, టౌన్‌ప్లానింగ్‌ సాయి, మహేందర్‌, ఏఎస్‌ఎఫ్‌లు భాస్కర్‌, వెంకటేష్‌, కాలనీవాసులు ప్రకాష్‌, రాజశేఖర్‌, వేణుకుమార్‌, బాలసుబ్రహ్మణ్యం, సందీప్‌, నాయకులు మల్లేష్‌గౌడ్‌, గిరి, యాదగిరిగౌడ్‌, కన్నాగౌడ్‌, సాజిత్‌, అరుణ్‌, అజయ్‌, రాహుల్‌, సుమన్‌, పోచయ్య, అంజన్న తదితరులు పాల్గొన్నారు.

చిన్నప్పటి నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



విద్యార్థులతో కమాండెంట్‌ రాహుల్‌సింగ్‌, ప్రిన్సిపాల్‌ లలిత

కుషాయిగూడ: చిన్ననాటి నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని సీఐఎస్‌ఎఫ్‌ కమాండెంట్‌ రాహుల్‌సింగ్‌ గౌతమ్‌ అన్నారు. కుషాయిగూడలోని రవీంద్రభారతి స్కూల్‌లో మంగళవారం ఇన్‌వెస్టరీ సెర్మనీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై వివిధ విభాగాల్లో నాయకులుగా ఎంపికైన విద్యార్థులకు బ్యాడ్జ్‌లను ప్రదానం చేసి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బాధ్యతలు స్వీకరించిన విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు. నిజాయితీగా ఓర్పుగా క్రమశిక్షణతో బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి తోటి విద్యార్థులకు మార్గదర్శకులుగా నిలవాలన్నారు. ప్రిన్సిపాల్‌ లలిత, డీఐ క్రాంతికుమార్‌, ఏడీఐ భరత్‌, డీన్‌ శ్రీలత సిబ్బంది పాల్గొన్నారు.

వ్యర్థాలను తొలగించండి !



కుషాయిగూడ వీధుల్లో పిచ్చిమొక్కలు, వ్యర్థాలతో ఇలా..

కుషాయిగూడ: కుషాయిగూడ వీధులన్నీ పూర్తిగా అపరిశుభ్రంగా మారి, పిచ్చిమొక్కలు, చెత్తచెదారంతో నిండిపోయాయి. దీంతో దోమలు వ్యాప్తి చెంది రోగాల భారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. కుషాయిగూడ కల్లు కాంపౌండ్‌ ఎదురుగా ఉన్న వీధుల్లో పూర్తిగా పిచ్చిమొక్కలతో పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా మారాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. శానిటేషన్‌ సిబ్బందికి పలుమార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదంటున్నారు. అధికారులు స్పందించి అపరిశుభ్రంగా మారిన వీధులను శుభ్రం చేసి దోమలు వ్యాప్తి చెందకుండా కాపాడాలని కోరుతున్నారు.

అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్‌ శ్రవణ్‌

మల్కాజిగిరి: శానిటేషన్‌, ఇంజినీరింగ్‌ విభాగం అధికారులు, సిబ్బంది సమన్వయంతో కలిసి పనిచేయాలని కార్పొరేటర్‌ శ్రవణ్‌ సూచించారు. ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ.. పలుచోట్ల ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని దెబ్బతిన్న రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేయాలని సూచించారు. నాలా వ్యర్థాలు, చెట్ల కొమ్మలు ఉంటున్నాయని వాటిని వెంటనే తొలగించాలన్నారు. ఆన్‌లైన్‌లో వచ్చే ఫిర్యాదులపై అలసత్వం ఉండకూడదని పేర్కొన్నారు. ఏఈ దీపక్‌, వీఐ రమేష్‌, ఎస్‌ఎఫ్‌ఏ గిరి తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ శాంతి సాయిజెన్‌శేఖర్‌

మల్లాపూర్‌: సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని నాచారం కార్పొరేటర్‌ శాంతి సాయిజెన్‌శేఖర్‌ అన్నారు. మంగళవారం నాచారం డివిజన్‌ పరిధిలోని కార్తీకేయనగర్‌లో రూ.40 లక్షలతో రోడ్డు 09,10 లోని సీసీరోడ్డు పనులను కార్పొరేటర్‌ పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ.. వరద నీరు నిలవకుండా పనులు చేపట్టాలని వివరించారు. వర్క్‌ఇన్‌స్పెక్టర్‌ విజయ్‌కుమార్‌, బీఆర్‌ఎస్‌ నేతలు భూపాల్‌రెడ్డి, మహేష్‌కుమార్‌, రాజేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

బోడుప్పల్‌: 7వ డివిజన్‌ సాయి మారుతీనగర్‌ కాలనీవాసులు మేయర్‌ తోటకూర అజయ్‌యాదవ్‌ను కలిసి తమ కాలనీలో నెలకొన్న సమస్యలను విన్నవించారు. రోడ్లు, పిచ్చి మొక్కలు, చెత్త, చెదారం, కుక్కల బెడద తీవ్రంగా ఉందని వివరించారు. తమ కాలనీలో పర్యటించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని మేయర్‌ను కోరారు. యూత్‌ కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నం తరుణ్‌గౌడ్‌, కాలనీవాసులు లక్ష్మణ్‌దాస్‌, యాదగిరిగౌడ్‌, మల్లేష్‌, దుర్గారెడ్డి, సోమయ్య తదితరులున్నారు.

తవ్వారు.. వదిలేశారు

- అసంపూర్తిగా అభివృద్ధి పనులు
- తీవ్ర ఇబ్బంది పడుతున్న ప్రజలు

గౌతంనగర్‌: డివిజన్‌ పరిధిలోని మల్లికార్జుననగర్‌లో రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. 7 నెలల క్రితం రూ. 70 లక్షలతో మురుగు, వరదనీటి సమస్యను పరిష్కరించేందుకు భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. టెండరు ద్వారా కాంట్రాక్టర్‌కు పనులను అప్పగించగా.. కొంతమేర రోడ్డు పనులు పూర్తయ్యాక బిల్లులు రాలేదని పనులను నిలిపేశారు. గత కొంతకాలంగా రోడ్లు గుంతలమయంగా మారి అధ్వానంగా మారాయి. దీంతో కాలనీవాసులు, రాకపోకలు సాగించే గుంతల మయంగా ఉన్న రహదారులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



మల్లికార్జుననగర్‌లో గుంతలమయంగా రోడ్డు ఇలా..

చిన్నపాటి వర్షంతో బురదమయంగా..

చిన్నపాటి వర్షం పడిందంటే రోడ్లన్నీ బురదమయంగా మారాయని, రోడ్లపై నడవాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదురౌతున్నాయని, కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మ్యాన్‌హోళ్లు సైతం కుంగిపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదని వాపోతున్నారు.

త్వరలోనే పనులు ప్రారంభం..



మల్లికార్జుననగర్‌లో నిలిచిపోయిన అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభమవుతాయి. కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో ఆలస్యమైంది. ఈ నెలాఖరులో పనులను ప్రారంభించేందుకు తగిన చర్యలు తీసుకుంటాం.

- దివ్యజ్యోతి, ఏఈ

నిత్యం అవస్థలు పడుతున్నాం..



మల్లికార్జుననగర్‌లో భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టడానికి రోడ్లను తవ్వి వదిలేశారు. నెలలు గడుస్తున్నా.. పనులు పూర్తికాకపోవడంతో నిత్యం కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి గతుకుల రోడ్లలో నీరు చేరి ఆయా కాలనీలు బురుదమయంగా మారాయి.

- వాసంశెట్టి శ్రీనివాస్‌, మల్లికార్జుననగర్‌

కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్లే..



మల్లికార్జుననగర్‌లో కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు గతంలో రూ.70 లక్షలతో భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించాం. కొంత వరకు పనులు పూర్తయ్యాయి. జీహెచ్‌ఎంసీ నుంచి బిల్లులు రావడం లేదని, సంబంధిత కాంట్రాక్టర్‌ పనులు నిలిపేశారు. పనులు ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశాం. అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగానే పనుల్లో జాప్యం జరుగుతుంది.

- మేకల సునీతాయాదవ్‌, కార్పొరేటర్‌

నేడు శ్రీనివాసుని కల్యాణం

రామంతాపూర్‌: వేంకటేశ్వర మహామంత్ర పీఠం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం 6 గంటలకు రామంతాపూర్‌లోని స్వామివారి ఆలయంలో కల్యాణమహోత్సవంతో పాటు భజగోవిందం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు.

అమ్మవారి ఘటం ఊరేగింపు



ఓల్డ్‌ అల్వాల్‌లో పోచమ్మ ఘటం ఊరేగిస్తున్న దృశ్యం

అల్వాల్‌: ఓల్డ్‌ అల్వాల్‌లోని శ్రీపోచమ్మ తల్లి ఘటాన్ని మంగళవారం వాడవాడలా వైభవంగా ఊరేగించారు. ఆనవాయితీగా అమ్మవారి ఘటాన్ని ఊరేగింపుగా స్థానిక కులస్తులు తీసుకొచ్చారు. కుమ్మరి రామన్‌కోల్‌ వీరేశం, పెద్ద సత్యనారాయణ, ఆర్‌.లక్ష్మణ్‌, దశరథ, చిన్న సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మౌలాలి: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని డీఈ మహేష్‌ గుత్తేదారులకు సూచించారు. సోమవారం మౌలాలి డివిజన్‌ హనుమాన్‌నగర్‌లో నూతనంగా వేస్తున్న సీసీరోడ్డు పనులను ఏఈ మధురిమతో కలిసి పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా త్వరితగతిన సీసీరోడ్డు పనులను పూర్తి చేయాలని ఏఈని ఆదేశించారు. బీజేపీ సీనియర్‌ నాయకులు మోహన్‌యాదవ్‌, రాకేష్‌, కిరణ్‌, శేఖర్‌, సంతోష్‌ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న డీఈ మహేష్‌

అంగన్‌వాడీ.. అవగాహన ర్యాలీ

అల్వాల్‌ : 'అమ్మ మాట అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో భాగంగా యాప్రాల్‌ అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మంగళవారం చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించాలని నినాదాలు చేస్తూ.. ప్లకార్డులను ప్రదర్శించారు. సుజాత, అనిత, అనురాధ, ఆశావర్కర్లు సునీత, సుగుణ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి : మల్కాజిగిరి సెక్టార్‌ దొడ్లబస్తీ అంగన్‌వాడీ కేంద్రం ఉపాధ్యాయురాలు మమత ఆధ్వర్యంలో మంగళవారం 'అమ్మ మాట అంగన్‌వాడీ బాట' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేఆర్‌నగర్‌, సత్తిరెడ్డినగర్‌, సత్యరాఘవేంద్రకాలనీ తదితర ప్రాంతాల్లో ఇతర అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఆశావర్కర్లతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్‌ వింధ్యావాహిని, ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, సునీత, విజయలక్ష్మి, రాజ్యలక్ష్మి, వనజ, ఆశావర్కర్‌ హేమలత తదితరులు పాల్గొన్నారు.



ఉచిత తాగునీటి యూనిట్‌ ప్రారంభం



యూనిట్‌ ప్రారంభించిన జోనల్‌ కమిషనర్‌ అనురాధ, రోషిరెడ్డి

కుషాయిగూడ: చర్లపల్లి పారిశ్రామికవాడలోని జయశంకర్‌ పార్కులో ఏర్పాటు చేసిన ఉచిత తాగునీటి యూనిట్‌ కార్మికులతో పాటు పార్కుకు వచ్చే సందర్శకులకు ఉపయోగకరంగా ఉంటుందని జోనల్‌ మేనేజర్‌ అనురాధ అన్నారు. పారిశ్రామికవాడలోని ఇన్నొవేటివ్‌ ఆక్వా సిస్టమ్స్‌, సినిమ్రయాస్‌ ఆధ్వర్యంలో మంగళవారం ఐలా చైర్మన్‌ జక్క రోషిరెడ్డితో కలిసి యూనిట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తాగునీటి యూనిట్‌ ఏర్పాటుకు ముందుకొచ్చిన 'ఇన్నొవేటివ్‌ ఆక్వా సిస్టమ్స్‌' అధినేత బబ్బూరి బాలరాజుగౌడ్‌ను ఆమె ఈ సందర్భంగా అభినందించారు. పార్కు నిర్వహణపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఐలా కమిషనర్‌ ప్రభాకర్‌, ప్రతినిధులు వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులున్నారు.

మురుగు.. పరుగు



ఓల్డ్‌ మల్లాపూర్‌లో రోడ్లపై పారుతున్న మురుగు, పేడ నీరు ఇలా..



మల్లాపూర్‌: ఓల్డ్‌ మల్లాపూర్‌ ఎస్సీ బస్తీ ఎగువ ప్రాంతం నుంచి గత కొద్ది రోజులుగా పేడ నీరు రోడ్లపై పారుతుంది. దీంతో స్థానిక బస్తీవాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దుర్వాసన, దుర్గంధం భరించలేక పోతున్నామని రాపోలు శ్రీనివాస్‌ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. తాగే నీటిలో సైతం పేడ నీరు సరఫరా అవుతుందని ఆరోపించారు. గతంలో జలమండలి అధికారులు, ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు.

మురుగు సమస్యకు పరిష్కారం



ఎయిర్‌టెక్‌ మిషన్‌తో శుభ్రం చేయిస్తున్న దృశ్యం

మల్కాజిగిరి: తాళ్లబస్తీలోని ఎంటమాలజి విభాగం గోడౌన్‌ ఎదురుగా పారుతున్న మురుగు సమస్యపై 'సాక్షి'లో 'మురుగు సమస్యను పరిష్కరించండి' వార్తకు అధికారులు స్పందించారు. గత కొంత కాలంగా డ్రైనేజీ మ్యాన్‌హోల్‌ నిండి మురుగు ప్రవహిస్తుండటంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంగళవారం జలమండలి విభాగం ఎయిర్‌టెక్‌ మిషన్‌ ద్వారా మ్యాన్‌హోల్స్‌ను శుభ్రం చేశారు. సమస్య తాత్కాలికంగా పరిష్కారమైందని పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

పరిసరాల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన

రామంతాపూర్‌: జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో రామంతాపూర్‌ జిల్లా పరిషత్‌ హైస్కూల్‌లో విద్యార్థులకు పరిశుభ్రతపై మంగళవారం అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్‌ బండారు శ్రీవాణి వెంకట్‌రావు మాట్లాడుతూ.. మన పరిసరాలతో పాటు టైర్లు పగిలిన కుండలు, పగిలిన బకెట్లు, కొబ్బరి చిప్ప లాంటి వాటిలో వర్షపునీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని, ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్‌ ఆంజనేయులు, శానిటరీ సూపర్‌ వైజర్‌ సుదర్శన్‌, ఎంటమాలజీ సూపర్‌వైజర్‌ నరేష్‌ శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

అల్వాల్‌: కుటుంబ సమస్యలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అల్వాల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్సై సురేష్‌ తెలిపిన వివరాల ప్రకారం మెదక్‌ జిల్లా గంగాపురానికి చెందిన చంద్రం (48) అల్వాల్‌ భవానీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. ప్యాకర్స్‌ అండ్‌ మూవర్స్‌ సంస్థలో పనిచేస్తున్నాడు. అతడికి ఓ కుమారుడు భార్య ఉన్నారు. కాగా మంగళవారం సాయంత్రం స్వగ్రామానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి భవానినగర్‌లోని ఖాళీ ప్రదేశంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. అప్పటికే అతడు మృతి చెందాడు. ఆర్థిక, కుటుంబసమస్యలే ఆత్మహత్యకు కారణమని పోలీసులు భావిస్తున్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఫిర్యాదు

మల్కాజిగిరి/ఆల్వాల్‌: రాజ్యాంగ బద్ధంగా గెలిచినా అభివృద్ధి పనులు చేయకుండా అడ్డుకుంటున్నారని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో తన ప్రోటోకాల్‌పై అధికారుల తీరు, కేసులు పెట్టడంపై అసెంబ్లీ స్పీకర్‌కు బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యేలతో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆల్వాల్‌ సర్కిల్‌ కార్యాలయం వద్ద ధర్నా చేస్తే డిప్యూటీ కమిషనర్‌ తప్పుడు కేసు పెట్టారని ఆరోపించారు. మౌలాలి డివిజన్‌లోని ఆర్టీసీ కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించేందుకు వెళ్తే కాంగ్రెస్‌ పార్టీకి చెందిన వారు దాడికి ప్రయత్నించారన్నారు. ఈ ఘటనపై స్పీకర్‌ డీసీపీ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని అభివృద్ధికి సహకరించాల్సిన అధికారులు ప్రోటోకాల్‌ ఉల్లంఘనలకు పాల్పడుతూ.. కాంగ్రెస్‌ పార్టీ నుంచి ఓడిపోయిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నారనే విషయాన్ని స్పీకర్‌ దృష్టికి తీసుకెళ్లామని వివరించారు.



స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి..

మల్లాపూర్‌: బీఆర్‌ఎస్‌ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని మాజీమంత్రి, బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ సూచించారు. మంగళవారం మల్లాపూర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ పన్నాల దేవేందర్‌రెడ్డి కేటీఆర్‌తో సమావేశయ్యారు. భవిష్యత్తులో బీఆర్‌ఎస్‌ పార్టీ అధికారంలోకి వస్తుందని, పార్టీ కార్యకర్తలు అధైర్యపడొద్దని ధైర్యం చెప్పినట్లు కార్పొరేటర్‌ చెప్పారు.



కేటీఆర్‌తో కార్పొరేటర్‌ పన్నాల దేవేందర్‌రెడ్డి

హరీష్‌రావును కలిసిన ఉద్యమ నేతలు



మాజీ మంత్రి హరీష్‌రావుతో జగదీష్‌గౌడ్‌, వెంకన్న

మల్కాజిగిరి: మాజీ మంత్రి హరీష్‌రావును బీఆర్‌ఎస్‌ నాయకుడు మాజీ కార్పొరేటర్‌ జగదీష్‌గౌడ్‌, జేఏసీ వెంకన్నలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల నగరానికి చెందిన బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యేలు పార్టీని వీడుతున్న కారణంగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కూడా పార్టీని వీడుతారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో హరీష్‌రావును కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. కోటేష్‌, తుపాకుల జనార్దన్‌, సతీష్‌ తదితరులున్నారు.

సీజనల్‌ వ్యాధులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పారిశుద్ధ్య విభాగం అధికారులు

ఉప్పల్‌: వర్షాకాలంలో వచ్చే సీజనల్‌ వ్యాధులపై ప్రతి ఒక్కరికీ సరైన అవగాహన అవసరమని ఉప్పల్‌ డిప్యూటీ కమిషనర్‌ ఆంజనేయులు సూచించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు మంగళవారం ఉప్పల్‌ సర్కిల్‌ పరిధిలోని పలు ప్రాంతాల్లో కాలనీ వెల్ఫేర్‌ అసోసియేషన్లతో కాలనీల్లో జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య విభాగం అధికారులు అవగాహన కల్పించారు. ముఖ్యంగా సీజనల్‌ వ్యాధులు డెంగీ, మలేరియా, మెదడువాపు లాంటి అనేక వ్యాధులు ప్రబలడానికి దోమలు, ఈగలే కారణమని, దీనికి పరిసరాల పరిశుభ్రతే ముఖ్యమని అధికారులు చెప్పారు. రోడ్లపై చెత్త వేయకూడదని, టైర్లు, మట్టి కుండీలు, కొబ్బరి బోండాలు తదితర వ్యర్థాలు లేకుండా చూసుకోవాలన్నారు.

ఇంటి తాళాలు పగుల గొట్టి..

బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు చోరీ

మేడిపల్లి: ఇంటి తాళాలు పగులగొట్టి రెండు తులాల బంగారు ఆభరణాలు, సుమారు రూ.50వేల నగదు ఎత్తుకెళ్లిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పీర్జాదిగూడ సాయిఐశ్వర్య కాలనీ రోడ్డు నెంబర్‌ 13లో నివాసం ఉంటున్న రామ్‌ప్రసాద్‌ శర్మ పురోహితుడిగా పనిచేస్తున్నాడు. ఈనెల 5వ తేదీన కుటుంబసభ్యులతో కలిసి యాత్రలకు వెళ్లారు. తిరిగి మంగళవారం తెల్లవారు జామున వచ్చి చూసేసరికి ఇంటితాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూసేసరికి బీరువాలో ఉన్న 2 తులాల బంగారు గొలుసులతో పాటు సుమారుగా రూ.50 వేల నగదు కనిపించలేదు. దీంతో బాధితులు మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్‌


13 కిలోల గంజాయి స్వాధీనం



పట్టుబడిన గంజాయితో పోలీసుల అదుపులో నిందితులు

ఉప్పల్‌: ఒడిశా నుంచి నగరానికి రవాణా చేస్తున్న గంజాయి ముఠాను ఉప్పల్‌ ఎక్సైజ్‌ పోలీసులు అరెస్ట్‌ చేశారు. వారి నుంచి 13 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్‌ ఇన్‌స్పెక్టర్‌ ఓంకార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా నుంచి నగర శివారు ప్రాంతాలైన ఉప్పల్‌, నాచారం, మల్లాపూర్‌ తదితర ప్రాంతాల్లో గంజాయి విక్రయించేందుకు ముఠా వస్తుందన్న విశ్వసనీయ సమాచారం మేరకు అప్రమత్తమైన ఉప్పల్‌ ఎక్సైజ్‌ పోలీసులు మంగళవారం సాయంత్రం ఉప్పల్‌ మాల బస్తీ వద్ద మాటు వేశారు. ఈలోపు ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదస్థితిలో సంచరిస్తుండగా.. అనుమానం వచ్చి పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితులు ఉప్పల్‌ మాల బస్తీకి చెందిన మహమ్మద్‌ అబ్దుల్‌ ముజీబ్‌, ఉప్పల్‌ ధర్మపురి కాలనీకి చెందిన శంకర్‌లుగా గుర్తించారు. వీరి ఇళ్లల్లో తనిఖీలు నిర్వహించగా.. దాదాపుగా 13.116 కిలోల గంజాయి లభ్యమైంది. నిందితుల నుంచి సెల్‌ఫోన్‌, ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులను రిమాండ్‌కు తరలించారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



కుషాయిగూడ: ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈనెల 14న చర్లపల్లి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని ఆక్స్‌ఫర్డ్‌ స్కూల్‌ వద్ద మద్యం మత్తులో అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. సదరు వ్యక్తిని చికిత్స నిమిత్తం 108లో గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి సంబంధీకులు చర్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని వారు కోరారు. మరిన్ని వివరాలకు 8712662722, 8712662788.